ఇన్స్యూచెయ్యండి. పేర్లుమాత్రం వెయ్యబోకండి" విలేఖరి "ఏ నైస్ ఐడియా" అమ్మన్న "ఉండండి! అయితే చీర మార్చుకువస్తా" అచ్చన్న "నాకూ అయిదు నిమిషాలు సెలవు" ఆ దంపతుల ఫోటో "రెడీ! క్లిక్!"

... ... ... ... ...

## చివర్నో చిన్న లెక్చరు

"పేరు తెలుసుకొని సౌరు తెలుసుకోవాలా? సౌరు తెలుసుకొని పేరు తెలుసుకోవాలా?" ఒకానొక చిత్రకళాప్రదర్శనంలో వచ్చిన పెద్ద ప్రశ్న అది. పేరుకుతగ్గ సౌరు, సౌరుకుతగ్గ పేరు రెండూ వున్నప్పుడు రెండూ తెలుసుకోవాలి. పేరు పుల్లమ్మ సౌరు జగన్మోహినిది అయినప్పుడు పేరు అడగకూడదు. పేరు చక్రవాకి సౌరు పూతనది అయినప్పుడు పేరుమాత్రం తెలుసుకొని సౌరు చూడకూడదు" అంది కళాభిజ్ఞ. విద్వాంసుడవ్నాడు "ఒక స్త్రీ ఒక పురుషుడు ప్రేమించి పెళ్లిచూపులు చూచుకుంటూ వున్నారూ అంటే ఇద్దరూ ఒకరి సౌరు ఒకరు తెలుసుకోవడమన్న మాటేగా? పెళ్లప్పుడు పేర్లు చెప్పిస్తారుగదా, అంచేత పేరూ సౌరూ రెండూ కూడా ఏకకాలమందే తెలుసుకోవాలి" అన్నాడు.

కళాభిజ్ఞ అంది–"పేరు తెలుసుకోకుండా పెళ్ళికావడానికి వీల్లేదూ? ఈ ప్రపంచంలో వీల్లెదూ?" అని. "లేదనే నాఊహ" అన్నాడు విద్వాంసుడు. "నీకు వివాహమైందా?" అని అడిగింది కళాభిజ్ఞ. 'లేదు' అన్నాడు విద్వాంసుడు. "నీకు నాపేరు తెలుసునా?" అని అడిగింది కళాభిజ్ఞ. "తెలియ" దన్నాడు విద్వాంసుడు. నీపేరే నాకు చెప్పలేదు కదా?" అని అడిగింది కూడాను. విద్వాంసుడు "నన్నెరిగున్నవాళ్ళకే నా పేరు తెలిసికోవడం చాలా దుర్ఘటము. అలాంటిది ఇప్పుడు ఇక్కడ కలుసు

కున్నంత మాత్రాన నీకెలా తెలిసింది అని నేను అనుకుంటాను ” అన్నాడు విద్వాంసుడు. “ నీపేరు నాకు తెలియకుండా వుణ్ణియి అలా. ఇప్పుడు నాకేసిచూడు ” అంది కళాభిజ్ఞ. “ నేను అందంగా లేనూ ? ” అని అడిగింది కూడాను. విద్వాంసు డామాటకు జవాబు చెప్పకుండానే అడిగేడు. ‘నేను నీకందంగా వున్నానా’ అని.

చిత్రకళా ప్రదర్శనంలోని బొమ్మలు అన్నీ అదివరకు మూకీభావంగా వున్నవి. యింకా మూకీభావం వహించినట్టయి పోతున్నాయి పైయిద్దరి హడావిడి నుడికారాన్ని వింటూ. బొమ్మలన్నింటి క్రిందా పేర్లున్నాయి. ఇక్కడేమిటో వీళ్లు పేళ్లతో అవసరంలేని సౌరును తెలుసుకోబోతున్నా రన్యోన్యమునూ, మరి గోడమీది బొమ్మలు ఇంక మాటాడతాయా ? అవీ వాళ్ళనే వింటున్నాయి.

కళాభిజ్ఞ విద్వాంసునకు ఓ తియ్యని ముద్దిచ్చి “ రా! నాతో రా! నా కారులో బీచికి రా! అక్కడంతా బోధపరుస్తాను అందంయొక్క విలువ అంతా. దానికీ పేరుకీ ఏమీ సంబంధం లేదు ” అంది. విద్వాంసు డనుకున్నాడు “ ఇదేదో నేటికాలపు సెక్సువెఱ్ఱి ఎత్తిన ఎలనాగ ” అని. కాని ఆమె చెట్టు వదల్లేక పోయినాడు. ఆమెయొక్క నునుముద్దు ప్రణయజలధిలో నతగాణ్ణి ఓలలాడించేసినట్లు ఆడించి పారేసింది. ఒక్క కనురెప్ప పాటు కాలంలో కళాభిజ్ఞయొక్క మోటారు కారులో విద్వాంసు డున్నాడు. ఆమె సరసని ఆసీనుడైయున్నాడు. మరొక్క రెప్ప పాటు కాలంలో అన్నట్టు ఆ యిద్దరూకూడా సముద్రతీరాన్ని యిసుకలో పవళించియున్నారు.

సాయంకాల సంధ్యారాగ పడమటి దెసది చేతులు చాచుకొని తూర్పుదెసనంతా అలుముకుపోతూ వున్నట్టుంది. కళాభిజ్ఞ అడిగింది విద్వాంసుణ్ని—“ ఆ కనవచ్చే సంధ్యారాగ శకలాల్ని తమలోనికి లాక్కొంటూ వుండే మేఘాల కొకదానికన్నా పేరు

వుందా ?" అని అడిగింది. లేదన్నాడు విద్వాంసుడు. మరో ఘడియకు లక్షల లక్షలు చుక్కలు కానవచ్చాయి ఆకాశంలో. కళాభిజ్ఞ అడిగింది—"విద్వాంసుడా ! చూడు ఆ పొడిచిన చుక్కల్లో ఏచుక్క ఏచుక్కను ప్రేమిస్తుందో పేరుపెట్టి చెప్ప గలవా ?" అని. "చెప్పలేను" అన్నాడు విద్వాంసుడు. మరో ఘడియకు వెన్నెల పఱచినట్లు అయిపోయింది ఇసుకతిప్ప యావత్తూ. కళాభిజ్ఞ అందికదా "విద్వాంసుడా! ఆ కాసే వెన్నెల యొక్క కిరణాల్లో ఒక్క కిరణముయొక్క పేరు ?" అని. విద్వాంసుడు అన్నాడు–"కిరణానికి పేరేమిటి ?" అని. "అలా గ్గానే పేరు అక్కరలేకుండా ఏప్రకారంగా అయితే మేఘం సంధ్యారాగశకలాన్ని, చుక్క కాంతి చుక్క కాంతిని, వెన్నెల కిరణం ఇసుక రేణువుని" అనుభస్తూవుందో అలాగ్గానే నీవూ నేనూ అన్యోన్యం అనుభోగించలేమూ ?" అంది కళాభిజ్ఞ. విద్వాంసుడు అన్నాడు–"అనుభోగించలేకేం ? అనుభోగించ వచ్చు" అని.

* * * * *

పైదాంపత్యంలాంటి దాంపత్యంగా లోకంలో దాంపత్యా లన్నీ ఈపాళంగా తమతమ పేర్లు మానేసేసి ఒకళ్ళ నొకళ్లు తమతమ సౌందర్య భావాల్నిబట్టే గ్రహించేరనుకోండి. ఎలా వుంటాయి మనోభావాలు ?

మనలో ప్రకాశించే కళ్ళు అమృతోపమానమైన కళ్ళు. మనలో వికసించేతావి దేవపారిజాతపుతావి అని నేను తలపోస్తాను.

ఎవరైనా ఏమిటి బలే ఒయ్యారంగా చూస్తున్నావు అంటే పేరు చెప్పంగా ! ఎవరైనా ఏమిటి అతి సున్నితంగా ఆఘ్రాణిస్తు న్నావు అంటే పేరు చెప్పంగా. లోకంలో అప్పుడు ఈర్ష్యలకూ "లవ్ లెటర్సు"కూ అవకాశం కించిత్తూ వుండదు.

నేను అలాంటి స్వర్ణయుగం కోసం ఆకాంక్షిస్తూవున్నాను.

... ... ... ... ...